ఆంధ్రజ్యోతి

andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3। కనిష్ఠం 11.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

గురువారం 9 జనవరి 2025



అడ్డగోలుగా.. అమ్మకాలు?

...రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా

- జిల్లాలో బ్రాండెడ్ పేరిట మందుగోలీల అమ్మకాలు
- అందినకాడికి దండుకుంటున్న వైనం
- జనరిక్ మందులపై అవగాహన కరువు
- ఇంకా గొలుసు రాతలపై మారని వైద్యుల తీరు
- కొరవడుతున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారుల పర్యవేక్షణ
- అంతా మెడికల్ మాఫియా గుప్పిట్లోనే..!!
- జిల్లావ్యాప్తంగా300 వరకు రిటైల్, హోల్‌సేల్ మెడికల్ దుకాణాలు

ఆదిలాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో అందరూ చేతులెత్తి మొక్కేది ఒక వైద్యుడికి మాత్రమే. కానీ అంతటి గొప్పతనం ఉన్న వైద్య వృత్తిని కొందరు వైద్యులు తమ స్వలాభం కోసం అబాసు పాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జ్వరం, జలుబు, దగ్గు, ఏ చిన్నరోగం వచ్చినా.. కొందరు వైద్యులు బ్రాండెడ్ మందులను అంటగడు తూ అడ్డగోలుగా దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్‌లో అతి చౌక ధరలకు లభించే జనరిక్ మందుల జోలికి అసలు వెళ్లడం లేదంటున్నారు. కొన్ని ఆసుపత్రులు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న మెడికల్ షాపులకు రెఫర్ చేస్తూ బ్రాండెడ్ పేరిట రోగులను ఎడాపెడా బాధేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 300 వరకు రిటైల్, హోల్‌సెల్ మెడికల్ దుకాణాలు ఉన్నాయి. అలాగే ఒకటి, రెండు జనరిక్ మెడికల్ షాపులు, జీవన్‌ధార్ ఔషధ దుకాణాలు ఉన్నాయి. అన్ని మెడికల్ షాపులలో విధిగా మందుల ధరలను సూచించే పట్టికను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా మెడికల్ షాపుల్లో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదంటున్నారు. అలాగే అడ్డగోలుగా మందుగోలీలను అమ్ముతూ రోగులను నిండా ముంచుతున్నారని బాధితులు వాపోతున్నా రు. ఇంత జరుగుతున్న ఔషధ నియంత్రణ శాఖాధికారులు చూసీచూడనట్లే వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదిలో నాలుగైదు కేసులు కూడా నమోదు కావడం లేదంటే ఔషధ నియంత్రణ శాఖ పనితీరు ఏవిధంగా ఉందో తెలుస్తూనే ఉంది. నిబంధనలు పాటించని మెడికల్ షాపుల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తే అధిక ధరలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఏది జనరిక్? ఏది బ్రాండెడ్??

జనరిక్ మందులపై ప్రజల్లో కనీస అవగాహన కనిపించడం లేదు. దీంతో ఏది జనరిక్? ఏది బ్రాండెడ్? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనరిక్ మందులు బ్రాండెడ్ మందుల కంటే 30 నుంచి 60 శాతం వరకు తక్కువ ధరల్లోనే లభిస్తాయి. కాతినీ సంబంధిత శాఖ అధికారులు మందుగోలీల ధరలపై ప్రజల్లో కనీస అవగాహన కల్పించడం లేదంటున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం నిర్దేశించిన నాణ్యత, రసాయన ప్రమాణాలు కూడా ఈ జనరిక్ మందులు కలిగి ఉంటాయి. కానీ వైద్యులు అవేవీ పట్టించుకోకుండానే మందుగోలీలను రాస్తూ వదిలేస్తున్నారు. అలాగే వీటిపై పన్నుల భారం కూడా తక్కువగానే ఉండడంతో చౌక ధరల్లోనే లభిస్తాయి. అన్ని పార్మా కంపెనీలు బ్రాండెడ్ మందులతో పాటు జనరిక్ మందులను కూడా తయారు చేస్తాయి. బ్రాండెడ్ మందు లలోనే అధిక లాభాలు రావడంతో జనరిక్ మందులవైపు దృష్టి సారించ డం లేదంటున్నారు. కొందరు జనరిక్ మందులనే బ్రాండెడ్ మందుల స్థాయిలో విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. మెడికల్‌షాపు యజమానులు నిబంధనలు పాటించేలా చూడాల్సిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మాములుగానే తీసుకోవడంతో మెడికల్ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండానే పోయిందంటున్నారు.

మెడికల్ షాపులదే పెత్తనం

కొత్తగా ఏ ఆసుపత్రిని ప్రారంభించినా.. మెడికల్ షాపులదే పెత్తనం కనిపిస్తోంది. మెడికల్‌షాపు యజమానులే ఆసుపత్రి నిర్వహణ, ఇతర బాధ్యతలను చూసుకోవాల్సి వస్తుంది. దీంతో వైద్యులు కూడా వారికి అడ్డుచెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఇంకా వైద్యులు రోగులకు అర్థం కానీ భాషలోనే గొలుసు రాతలు రాస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు గొలుసు రాతలు వద్దంటూ ఆదేశాలు ఇచ్చినా.. కొందరు వైద్యుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. తమ ఆసుపత్రి మెడికల్ షాపులో దొరికే మందులు, సిబ్బందికి మాత్రమే అర్థమయ్యేలా రాతలు రాయడం వైద్యుల వ్యాపార ధోరణికి అద్ధం పడుతుంది. ఇతర చోట్ల చౌక ధరలకు మందులను కొనుగోలు చేసే అవకాశమే లేకుండా పోతోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. మొత్తానికి మెడికల్ మాఫియా గుప్పిట్లోనే వైద్యులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఉన్నట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి.



పత్తాలేని పర్యవేక్షణ

అక్రమాలకు అడ్డుకట్ట వేసి మందుగోలీల ధరలు అందరికీ

(తరువాయి 6వ పేజీలో...)

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

: ఏ.శ్రీలత, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి

ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మందు గోలీలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిరంతరంగా మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నాం. నిబంధనలను పాటించని మెడికల్ దుకాణాలకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నాం. గడిచిన ఏడాదిలో 70 దుకాణాలకు పైగా షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకున్నాం. జనరిక్ మందుల అమ్మకాలు పెరిగే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 300లకు పైగా రిటైల్, హోల్‌సేల్ మెడికల్ దుకాణాలు ఉండగా.. నాలుగైదు మాత్రమే జనరిక్ మందులను విక్రయించే షాపులు ఉన్నాయి. అదేవిధంగా ధరల నియంత్రణకు అన్ని షాపుల్లో ధరల పట్టికను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఫటా..ఫట్...

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం

డి.శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఆదిలాబాద్



ఆంధ్రజ్యోతి: రైతులకు ప్రస్తుతం ఎలాంటి సబ్సిడీ పథకాలను అందజేస్తున్నారు?

అధికారి: అర్హులైన రైతులందరికీ ఆహార భద్రత పథకం కింద పప్పుదినుసులు, చిరు ధాన్యాలు, నూనెగింజల దిగుబడులను పెంచేందుకు అవసరమైన విత్తనాలు, పనిముట్లు, స్పింక్లర్ పైపులను సబ్సిడీపై అందజేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగింది?

అధికారి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అర్హులైన రైతులకు రుణమాఫీ జరిగింది. ఇప్పటి వరకు 62వేల 16 మంది రైతులకుగాను రూ.685.421 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: బాధిత కుటుంబాలకు రైతు బీమా సొమ్ము సక్రమంగా అందుతుందా?

అధికారి: గత ఏడాదిలో 330 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా 229 మంది రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.11.45కోట్ల పరిహారాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: రైతులందరికి పంట నష్ట పరిహారం చెల్లించారా?

అధికారి: గతేడు ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని 8మండలాల పరిధిలో 109 గ్రామాల్లో 3096.03 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించాం. దీనికి గాను ఎకరాన రూ.10 వేల చొప్పున రూ.3కోట్ల 9లక్షల 60వేల 750 నష్ట పరిహారాన్ని 2043 మంది రైతులకు చెల్లించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: యాసంగి సీజన్‌కు సంబంధించిన ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా?

అధికారి: యాసంగి సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 23వేల 650 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని గుర్తించాం. ఇప్పటి వరకు 10వేల మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశాం. మరో 10వేల 500 ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా శనగ, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, విత్తనాలు అందుబాటులో ఉంచాం.

ఆంధ్రజ్యోతి: ఫర్టిలైజర్ దుకాణాలలో మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నారా?

అధికారి: అవును. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. ఏదైనా అనుమానం వస్తే రైతులు సంబంధిత వ్యవసాయ శాఖాధికారితో పాటు నేరుగా నాకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

- ఆదిలాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి)



గిన్నెర వైపు వెళ్తున్న నాగోబా ప్రచార రథం

గిన్నెర వైపు కదిలిన నాగోబా ప్రచార రథం

ఉట్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మేస్రం వంశీయుల ఇలవెల్పు నాగోబా దేవత జాతర ఈనెల 29 నుంచి ప్రారంభంకానుండగా మేస్రం వంశీయుల చకడా (ప్రచార రథం) బుధవారం ఉట్నూర్ మండలంలోని సాలెవాడ నుంచి ఇంద్రవెల్లి మండలం గిన్నెరవైపు కదిలింది.నాగోబా జాతర ప్రచారరథంలో కటోడా దాదారావు, కోసుపటేల్ ఆధ్వర్యంలో మేస్రం వంశీయుల గ్రామాలలో జాతర ప్రచారం నిర్వహిస్తూ వెళ్తున్నామని వారు తెలిపారు. సాలెవాడ నుంచి ఈ రోజు గిన్నెరా చేరుకొని గురువారం అక్కడి నుంచి కేస్లాపూర్ వెళ్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగోరావ్, తదితరులున్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పలు

తాంసి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గడిచిన 41 రోజుల పాటు నియమ, నిష్ఠలతో కఠోరమైన దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు బుధవారం శబరి యాత్రకు బయలుదేరారు. తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల, పొన్నారి, వడ్డాడి గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు. ముందుగా వారివారి ఆలయాల్లో ఇరుముడులు ధరించారు. గురుస్వాములు దామోదర్, వేణుగోపాల్ స్వాములు అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కట్టారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ నినాదాలు చేస్తూ బయలుదేరారు. అయ్యప్ప స్వాములను వారి వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు మేళ వాయిద్యాలతో ఘనంగా వీడ్కోలు పలికారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు వాడవద్దని, మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తాయని, భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. మత్తు పదార్థాలను ప్రోత్సహించే వారికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లకు వచ్చే ఓటీపీలకు ఏటీఎం పిన్ నెంబర్లు ఎవరికీ చెప్పకూడదన్నారు. ఇందులో హెచ్‌ఎం రాంమోహన్ రావు, ఏఎస్సై కాత్లే భీంరావ్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నంద అశోక్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ లోని టీఎన్జీఓ కార్యాలయంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు జె.నర్సింలు, కార్యదర్శి శ్రీనివాస్, ఓం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

అంగన్‌వాడీల్లో శుభ్రత పాటించాలి

నేరడిగొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో గల వంటగదులను శుభ్రంగా ఉంచాలని అన్నారు. గర్భిణీలు బాలింతలకు క్రమం తప్పకుండ పోశకహారం అందించాలని అన్నారు. ఆర్డీవో వెంట ఆర్ఐ నాగోరావు, సాయిరాం. ఎంసీ శంకర్, జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ షకీల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉట్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిరు ద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో జూనియర్ కెమిస్ట్రి ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగానికి ఇంటర్ ఎంపీపీ, బైపీసీ, 2023, 2024లో పూర్తి అయిన, కెమిస్ట్రీతో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫోటోలతో ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలన్నారు.

92 శాతం ఇందిరమ్మ సర్వే పూర్తి

భోథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ సర్వే 92శాతం పూర్తయిందని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మండలం మొత్తం మీద 13056 ఇల్లు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 11,941 ఇళ్ల సర్వే పూర్తయిందని ఎంపీడీవో వివరించారు. కొన్ని గ్రామాలలో సర్వే సిబ్బందికి సిగ్నల్ లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తడంతో ఆఫ్ లైన్ సర్వే కోసం అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే అనంతరం సూపర్ చెక్ చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని ఎంపీడీవో వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

జైనథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపరాదని నేషనల్ హైవే పీఆర్‌వో కేసర్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మాండగడ గ్రామంలో 2025 జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్బంగా వివిధ వాహనదారులకు గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేసర్‌సింగ్ మాట్లాడుతూ అతి వేగంతో వాహనాలను నడపరాదని, జీబ్రాక్రాసింగ్ గుర్తులను గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.



మాండగడలో మాట్లాడుతున్న హైవే పీఆర్‌వో కేసర్‌సింగ్

సంక్రాంతి తర్వాత అర్జీల స్వీకరణ

- ఎంపీడీవోలు, డేటా ఆపరేటర్లకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం
- జడ్పీ సమావేశ మందిరంలో 'సీఎం ప్రజావాణి'పై అవగాహన కార్యక్రమం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి జిల్లా పైలెట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేసే డేటా ఆపరేటర్లు ఎంపీడీవోలకు రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని కార్యక్రమం నిర్వహణపై దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిసాన్ మిత్ర అధికా రులు ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై పరిశీలిస్తారని అన్నారు. దీనిలో భాగంగా వ్యవసాయం, రెవెన్యూ విద్యుత్, మిష న్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి భూమాత, తాగునీటి, పెన్షన్ ఆయా శాఖలకు సంబంధించి అన్ని అంశాలతో కూడిన స్టాండర్డ్ ఆప రేటింగ్ ప్రోసిజర్ వ్యవస్థను రూపొందిస్తారన్నారు. అలాగే అర్జీదారులు అందించే సమస్యను గురించి ఆన్‌లైన్‌లో ఆ అంశాన్ని ఎంపిక చేసుకొని దరఖాస్తుదారుడికి వెంటనే రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. విషయాన్ని సంబంధిత అధికారికి పార్వడ్ చేసి సమస్య ఏ స్థాయిలో ఉందో తెలిపేలా సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. దీనికి సంబంధించి సంక్రాంతి పండుగ తర్వాత అర్జీల స్వీకరణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

రక్తదాతలు ప్రాణాలు కాపాడొచ్చు

ఆదిలాబాద్ రూరల్: ప్రమాదాల్లో సమయంలో రక్తం అవసరమవుతుందని, అందుబాటులో ఉంటే ప్రాణాలు కాపాడవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డిపోలో నిర్వహించిన ఈ శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో ఆర్ఎం సోలోమన్, డిప్యూటీ ఆర్ఎంలు ప్రవీణ్ కుమార్, ప్రణీత్, కల్పన, డాక్టర్ కీర్తి, ఎంఎఫ్ శ్రీకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు వందన, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు రూ.340 కోట్ల మంజూరు



ఆదిలాబాద్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



నేరడిగొండలో జాతీయర రహదారిని పరిశీలిస్తున్న ఎంపీ నగేష్

పట్టణంలో అభివృద్ధి పనులకు ఎంపీ గోడం నగేష్ శంకుస్థాపన

ఆదిలాబాద్ రూరల్/మావల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంపిక చేసుకుని అమృత్ పథకం కింద తాగు నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.340 కోట్లు ఇచ్చారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో రూ.కోటి 20 లక్షల టీఎఫ్‌డీసీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కాలనీకి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను కౌన్సిలర్ కృష్ణ యాదవ్‌తోపాటు కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ప్రాంతాలకు అనుగుణంగా ఆదిలాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. అమృత్ పథకంలో ఎంపిక చేసి స్వచ్ఛమైన తాగు నీరు అందించడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు నిధులు వెచ్చించి పనులు చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు పెండింగ్‌లో ఉన్న వాటిని గుర్తించి ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వానికి విన్నవించి పూర్తిచేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సుభాష్ నగర్ కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు ముకుంద్, లాలామున్న, రవి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

నేరడిగొండ: నేరడిగొండ గ్రామాన్ని ఆనుకొని ఉన్న జాతీయ రహదారి ఇరు పక్కల సర్వీసు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. గురువారం మండలంలో ఎన్‌హెచ్‌ఏ జాతీయ రహదారి తెలంగాణ రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌తో కలిసి అధికారులతో కలిసి జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ రోల్‌మామడ గ్రామ సమీపంలో సైతం బస్సు షెల్టర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్సు షెల్టర్‌తో పాటు సర్వీస్ రోడ్డు పనులను కూడా ప్రారంభించాలన్నారు నేరడిగొండలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రాత్రిపూట వెలుతురు లేక అవస్థలు పడుతున్నారని సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ వెంట జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌లు, టీం లీడర్ ప్రసన్నకుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు బెల్లంకొండ సత్యనారాయణగౌడ్, తాంసి మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, పి.తులసిరామ్, గాదెశంకర్, రాజురెడ్డి, కమల్‌సింగ్, తదితరులున్నారు.

జాతీయ రహదారిని పరిశీలించిన ఎంపీ నగేష్

ఇచ్చోడ: ఇచ్చోడలో జాతీయ రహదారి పై కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులను ఎంపీ నగేష్ జాతీయ రహదారి రీజినల్ అధికారి శివశంకర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ పరిధిలోని జాతీయ రహదారిపై సర్వీసు రోడ్ల, సెంట్రల్ లైటింగ్, వంతెన సమస్యలను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. ఇచ్చోడ వద్ద త్వరలోనే ఫైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు. వారితో పాటు పీడీ శ్రీనివాసులు, టీం లీడర్ ప్రసన్నకుమార్, తాంసి మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, నాయకులు కృష్ణకుమార్, తులసిరాం, గంగాధర్, శంకర్, తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాల వినతి

బోథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డి(బి) గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసీ గ్రామాలైన టివిటి పల్లె, పరుపులపల్లి గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, అలాగే పార్డి గ్రామపంచాయతీ పరిధిలోని మామిడి గూడ, గొల్లాపూర్ గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ఆదివాసీలతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, బుధ వారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాలలో కనీస మౌలిక వసతులు కల్పనకు తమ గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ డీపీవో, ఎంపీడీవోలకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.

గ్రామంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

బజార్‌హత్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల గ్రామమైన గంగాపూర్ గ్రామంలో ఆరు హైమాస్ట్ లైట్లను ఏర్పటు చేశారు. ఎమ్మెల్యే తన నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసినందుకు గ్రామ యువకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

జైనథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం మండలంలోని మాకోడ గ్రామంలో గల స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇ.నారాయణ, ఎంపీటీసీలు ఊశన్న, రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కె.పురుషోత్తంయాదవ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు నివాస స్థలం ఇవ్వాలి'

బోథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతగానో కృషి చేశామని, ఉద్యమ పోరాటంలో అరెస్టు చేయడంతో పాటు అప్పటి ప్రభుత్వం జైల్లో పెట్టిందని, తమకు ప్రభుత్వం నివాస స్థలాలను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారులు రమణ గౌడ్, దేవి దాసులు బుధవారం పంచాయతీ ఈవో అంజయ్యకు వినతిపత్రం ఇచ్చారు. తమకు ప్రభుత్వపరంగా ఎలాంటి సహకారం అందలేదని వారు ఈ సందర్భంగా వాపోయారు.

'పల్లెల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి'

నేరడిగొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీఆ డే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గాజిలి గ్రామంలో గ్రామస్థుల పిలుపు మేరకు గ్రామంలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తెలంగాణలో అన్ని పల్లెలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. ప్రతి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామాలనను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో పేద ప్రజలకు రూ.5లక్షలతో త్వరలోనే ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో బోథ్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, గ్రామపటేల్ లక్ష్మణ్, పూజారి చిత్ర వెంకి, మేస్రం నాగోరావు, సిడాం రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో తగ్గని చలి తీవ్రత

● భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.7 డి గ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు ● తలమడుగులో మధ్యాహ్నం వేళ చలి మంటలు

ఆదిలాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాపై ఇంకా చలి ప్రభావం కొనసాగుతునే ఉంది. సంక్రాంతి పండుగ వరకు చలి ప్రభావం ఎక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 కాగా కనిష్టంగా 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.7, బేలలో 8.8, ఆదిలాబాద్ రూరల్‌లో 9.6, బోథ్‌లో 10.1, జైనథ్‌లో 11.3, ఆదిలాబాద్‌అర్బన్‌లో 12.4 ఇలా జిల్లా వ్యాప్తంగా 15డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం రాత్రి వేళల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగానే కనిపిస్తుంది. ముఖ్యంగా కార్మికులు, రైతు కూలీలు ఉదయం వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. మార్నింగ్ వాకర్స్ ఆలస్యంగా బయటకు వెళ్లి వాకింగ్ చేస్తున్నారు. మరికొంత కాలం వృద్ధులు, చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.



తలమడుగులో మధ్యాహ్నం పూట చలి మంటలు కాగుతున్న గ్రామస్థులు

● మిట్ట మధ్యాహ్నం చలి మంటలు

తలమడుగు: గత వారం రోజులుగా చలి విజృంభించడంతో గ్రామీణ ప్రజలు మిట్ట మధ్యాహ్నం చలి మంటలు కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చలితోపాటు ఈదురుగాలులు వీచడంతో చిన్నపిల్లలు. వృద్ధులు చలికి తట్టుకోలేకపోతున్నారు. అలాగే రైతులు గ్రామీణ కూలీలు పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అస్తమా, దగ్గు, దమ్ము వ్యాధిగ్రస్తులు ఇంటి నుంచి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో చలి ఎక్కువగా ఉండడంతో ఆదివాసీ గిరిజనులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదివాసీ గిరిజనులకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

సిరికొండలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సిరికొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మూడవ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను జిల్లా అదనపు పీడీ కుటుంబరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 19 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.6,74,60,182 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు వేతనాలుగా రూ.6,65,74,379 కోట్లు, రూ.8,85,803 లక్షలు సామగ్రికి చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా.. ప్రభుత్వ ఉద్యోగులైనటువంటి అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ ఉద్యోగులకు, ఒకరికి బదులు మరొకరు పని చేయడం, చనిపోయిన వారి పేరు మీద చెల్లింపులు చేయడం, ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు, హరితహారంలో నాటిన మొక్కలు లేకపోవడం, మట్టిరోడ్లకు తప్పుడు లెక్కలు సృష్టించి బిల్లులు స్వాహ చేయడం వంటి తప్పిదాలపై మండలంలోని 19 గ్రామాలకు గానూ దాదాపు రూ.3 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజేశ్వర్, అసిస్టెంట్ పీడీ కృష్ణారావు, పీఆర్ డీఈ సిద్ధిఖ్, పీఆర్ ఏఈ నర్సింగ్, ఎంపీడీవో రవీందర్, ఏపీవో భీంరావ్, ఎస్సార్పీ తిరుపతి, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు, ప్రజలు

సైబర్ క్రైమ్ నేరాల పై అవగాహన

ఉట్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌ల ఉచ్చులో పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ రమా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు వారి సహకారంతో సైబర్‌క్రైమ్ (ఆన్‌లైన్ మోసాలు) అనే అంశంపైన ఎస్సై రమ్య, ఏఎస్సై దిలీప్‌కుమార్, వారి సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమ్య మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీలకు ఏటీఎం పిన్ నెంబర్లు ఎవరికీ చెప్పవద్దన్నారు. ఇందులో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, వినో ద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, సుజాత, తిరుపతి, నవీన్, దశరథ్, రూప, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

జైనథ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దీపాయిగూడ, మాండగడ పిప్పర్‌వాడ, కంటం, కాప్రీ, జైనథ్ గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్‌రెడ్డి, తదితరులున్నారు.

ఆదిలాబాద్ అర్బన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా వారి ఇంటికి వెళ్లి అందించారు. పట్టణంలోని విద్యనగర్ కాలనీలో పెబ్బత్‌వార్ శ్రీజ ఆమె కూతురుకు రూ.లక్షా 7500 చెక్కును ఆయన అందించారు.

అడ్డగోలుగా మందుగోలీల అమ్మకాలు?

(5వ పేజీ తరువాయి...)

అందుబాటులో ఉండేలా చూడాల్సిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం జిల్లాలో ఎక్కడ ఉందో? కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉన్నత అధికారులు ఆ శాఖపై దృష్టి సారించక పోవడంతో అడిగే వారే కరువవుతున్నారు. జిల్లాలో ఎక్కడ జనరిక్ మందులనే కొనుగోలు చేయాలని అవగాహన కల్పించిన దాఖలాలు కనిపించడం లేదు. కొంతమంది వైద్యు లు సొంతంగా మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తూ బ్రాండెడ్ మందుల పేరిట రెఫర్ చేస్తున్నారు. ఎన్ని నిబంధనలు విధించినా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) ఆదేశాలను బేఖాతరు చేస్తూనే ఉన్నారు. ఇటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అదేతీరు కనిపిస్తోంది. కొందరు వైద్యులు మెడికల్ షాపు యజమానులతో రహస్యంగా సంబంధాలు పెట్టుకుంటూ బ్రాండెడ్ మందుల కొనుగోలుకే రెఫర్ చేస్తున్నారు. అంతేకాకుండా మెడికల్ విషయంలో కనీస అవగాహన లేని మధ్య తరగతి నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం వైద్య ఆరోగ్య శాఖ అధికారులైనా హెచ్చరించే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

విద్యుత్ షాక్‌తో బస్ క్లీనర్ దుర్మరణం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై కళాశాల బస్సు క్లీనర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నలంద కళాశాల బస్సులో ఖానాపూర్ కాలనీ విద్యార్థులను ఎక్కించుకొని వెనక్కి వస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభంపై కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు గజానన్‌కు తగిలాయి. దీంతో ఆయన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ బంధువు ప్రాణాలు పోయాయని ఆరోపిస్తూ మండలంలోని అకోలి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ బందోబస్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నలంద కళాశాల బస్సుకు క్లీనర్‌గా అకోలి గ్రామానికి చెందిన గాలి గజానంద్ పని చేస్తున్నాడు. బుధవారం సోనల్‌గల్లి వద్ద బస్సు తిప్పే క్రమంలో 11కేవీ వైర్లు కిందకు వెళ్తుండగా కరెంట్ షాకుకు గురై మృతి చెందాడు. విద్యుత్ అధికారులకు దీని పై కాలనీ వాసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్ల క్ష్యం వల్ల ప్రాణాలు పోయాయని, కుటుంబం పెద్దదిక్కు కోల్పోయిందన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మూడు కుటుంబాలలో విషాదం

బజార్‌హత్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని దేగామ గ్రామం వద్ద మంగళవారం సాయంకాలం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా.. తీవ్ర గాయాలైన మైలారపు అరుణ్ (20), ఆశన్న(62)లను మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాదులోని రిమ్స్‌కు తరలించారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో మైలారపు అరుణ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆశన్న కూడా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 11 గంటలకు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్క ప్రమాదంతో మూడు కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరంతా ఒకే గ్రామానికి చెందిన వారవడంతో గిర్నూర్ గ్రామంలో రోదనలు మిన్నంటాయి.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

గుడిహత్నూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గుడుంబా సారా తయారు చేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ హెచ్చరించారు. మండలంలోని ముత్నూర్‌కు చెందిన గులే శివాజీ గుడుంబా విక్రయిస్తూ పలు మార్లు పట్టుబట్టాడు. అయితే, తహసీల్దార్ కవిత రెడ్డి ముందర బైండోవర్ చేయడం జరిగిందన్నారు. బైండోవర్ ఉల్లఘించినందుకు రూ.50వేల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

వాటర్‌ట్యాంక్ మంజూరు చేయాలని

డీసీసీ అధ్యక్షుడికి వినతి



కూచాడి శ్రీహరిరావుకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతన వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు గ్రామస్థులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన 90 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. నూతన వాటర్‌ట్యాంక్ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ అబ్బడి ప్రతాప్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కోండ్ర నరేష్ రెడ్డి, నాయకులు నగేష్, గ్రామస్తులు, రజినీకాంత్, రవి, అజయ్, కిరణ్ కుమార్, రాజశేఖర్, సుమలత, రమేష్, తదితరులున్నారు.

01 ఖానాపూర్ 08

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి

ఖానాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కడెం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు నల్ల గుడ్డలను కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న తమకు గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలన్నింటినీ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. తమకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, కడెం మండల పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్తు

భైంసా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీతత్వ మార్కెట్‌లో వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని డీఐఈవో జాదవ్ పరుశురామ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భైంసాలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వృత్తి విద్య కోర్సులలో చేరడం ద్వారా వృత్తి నైపుణ్యతను పెంపొందించుకొని చిన్న వయస్సులోనే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పొంది జీవితంలో స్థిరపడేందుకు అవకాశాలున్నాయని వివరించారు. డిమాండ్ ఉన్న వృత్తి విద్య కోర్సును ఎంచుకొని అందులో నిష్ణాతులుగా ఎదిగితే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని వెల్లడించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులందరూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అకాంక్షించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే సత్ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఇందులో కళాశాల డైరెక్టర్ డా.ముష్కం రామకృష్ణ గౌడ్, ప్రిన్సిపల్ సాయినాథ్ పాల్గొన్నారు.

సమ్మె బాట వీడి విధుల్లోకి సమగ్ర శిక్షా ఉద్యోగులు

● కేజీబీవీల్లో బోధన పునః ప్రారంభం ● ఎంఆర్‌సీలలో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌కు శ్రీకారం

భైంసా,జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె ముగిసింది. ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర కమిషనర్ జరిపిన చర్చల్లో సానుకూల హామీ లభించడంతో మంగళవారం సమ్మె బాట వీడిన ఉద్యోగులు బుధవారం పూర్తి స్థాయి విధుల్లో చేరారు. జిల్లా స్థాయిలో డీఈవోకు సమ్మె విరమిస్తున్నట్లు లేఖలు అందచేసిన సమగ్ర శిక్షాలోని వివిధ విభాగాల ఉద్యోగులు బుధవారం మండల స్థాయిలో ఆయా మండలాల ఎంఆర్‌సీ కేంద్రాల్లో మండల విద్యాధికారులకు సంబంధిత సమ్మె విరమణ, విధుల్లోకి చేరుతున్న లేఖలను అందచేశారు. అయితే దాదాపు నెల రోజులకు పైగానే సమ్మె కొనసాగింది. ఈ కారణంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఇన్నాళ్లు బోధన కుంటుపడటంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. మండల, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో నిర్వహణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. ఎట్టకేలకు 32 రోజుల తర్వాత ఉద్యోగులు సమ్మె విరమించడంతో సమస్యకు తెరపడింది. కేజీబీవీల్లో బోధన పునఃప్రారంభమైంది. డీఈవో, ఎంఆర్‌సీ కార్యాలయాల్లో ఇన్నాళ్లుగా నామమాత్రంగా జరిగిన పాఠశాలల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతమయ్యింది. పెండింగ్ పనులకు మోక్షం కలిగింది.



విధుల్లో చేరుతున్నట్లు ఎంఈవోకు లేఖ అందచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు



భైంసా కేజీబీవీలో పాఠ్యాంశాలు బోధిస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయురాలు

● ప్రణాళిక రూపకల్పనలో...

కేజీబీవీల్లో ఏకంగా నెల రోజులకు పైగా విద్యాబోధన నిలిచిపోయింది. నిర్మల్ జిల్లాలో 18 కేజీబీవీల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 5,693 వేల మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. 643 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో డీపీవో స్టాఫ్ 9 మంది, ఎంఆర్‌సీ స్టాఫ్ 134 మంది, ఐఈఆర్‌సీ స్టాఫ్ 33 మంది, కేజీబీవీ టీచింగ్ స్టాఫ్ 235 మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ 23 మంది ఉన్నారు. ప్రస్తుతం బోధన, బోధనేతర సిబ్బంది సమ్మె బాటను వీడి విధుల్లో చేరడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు సత్వరం సిలబస్ పూర్తి చేసి పునశ్చరణ తరగతులు నిర్వహించేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయులు అదనంగా సమయం తీసుకొని విద్యార్థినులకు బోధించే దిశగా చర్యలు ముమ్మరమయ్యాయి..

● బిజిబిజీగా సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమ్మె బాట వీడి విధుల్లో చేరిన సమగ్రా శిక్షా ఉద్యోగులు విధుల నిర్వహణలో తలమునకలయ్యారు. కేజీబీవీల్లోని ఉపాధ్యాయులు విద్యాబోధనలో నిమగ్నమవ్వగా ఎంఆర్‌సీల్లోని ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాఠశాలల, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. సమ్మె కారణంగా నెల రోజులకు పైగా ఉద్యోగులు లేక వెలవెలబోయిన కేజీబీవీలు, ఎంఆర్‌సీ కేంద్రాలు బుధవారం వారందరి రాకతో కళకళలాడాయి. అంతటా సందడి నెలకొంది. విధుల్లో చేరిన కేజీబీవీ ఉపాధ్యాయులు తమ తమ సెలబస్ పూర్తి చేసే ప్రక్రియలో, ఎంఆర్‌సీల్లో పెండింగ్ పనులను పూర్తి చేసే పనుల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు బిజిబిజీగా మారిపోయారు.

● టీచర్లు విధుల్లో చేరడం సంతృప్తినిచ్చింది

పాఠాలు లేక నెల రోజులు దాటింది. ఏం చేయాలె అర్థం కాలేదు. రోజు వారీగా మా ఉపాధ్యాయుల రాక కోసం వేచి చూశాం. చాలా మంది నాతోటి స్నేహితులు ఇళ్లకు వెళ్లారు. టీచర్లు సమ్మె బాటను వీడి విధుల్లో చేరిన నేపథ్యంలో తిరిగి బోధన ప్రారంభమడంతో ఆనందం కలుగుతోంది.

(కృతిక, పదవతరగతి విద్యార్థిని, కేజీబీవీ,భైంసా)

కేజీబీవీల్లో యథావిధిగా కార్యక్రమ సరళి

సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెను వీడి విధుల్లో చేరిన నేపథ్యంలో కేజీబీవీల్లో యథావిధిగా కార్యక్రమల సరళి పునః ప్రారంభమయ్యింది. టీచింగ్,నాన్ టీచింగ్ స్టాఫ్ తమ తమ పనుల నిర్వహణలో నిమగ్నమయ్యారు. నెల రోజులకు పైగా కాలం నుంచి పాఠ్యాంశాల బోధన అంతంత మాత్రంగానే జరిగింది. దీంతో సెలబస్‌ను సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని టీచింగ్ స్టాఫ్‌కు సూచించాము. ప్రధానంగా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించాం. శత శాతం ఉత్తీర్ణతయే లక్ష్యంగా పెట్టుకొని పాటు పడాలని తెలియచెప్పాం. ఎంఆర్‌సీల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోజు వారీ కార్యక్రమాలు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు చేపట్టాలని వెల్లడించాం.

(పి.రామరావ్, డీఈవో, నిర్మల్)

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె విరమణ

భైంసా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చుకునేందుకు గాను సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన సమ్మెను బుధవారం విరమించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూర్ రాములుతో కూడిన ప్రతినిధి బృందం జరిపిన చర్చలు ఫలప్రదమైన నేపథ్యంలో సమ్మెను విరమించినట్లుగా సివిల్ సప్లయీస్ హమాలీల అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి, డిమాండ్ల నేరవేర్పే విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల , స్పష్టమైన హమీ లభించిన నేపథ్యంలోనే సమ్మెను విరమించినట్లుగా తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం భైంసాలోని ఎంఎల్ఎస్ కేంద్ర అవరణలోని సమ్మె శిబిరంలో హమాలీలు సంబరాలు జరుపుకున్నారు. ఎంఎల్ఎస్ కేంద్ర ఇంచార్జీ బాబురావ్‌తో పాటు పలువురు రేషన్ డీలర్లు సమ్మె విరమించిన హమాలీలకు మిఠాయిలు తినిపించారు.



హమాలీలకు స్వీట్లు తినిపిస్తున్న ఎంఎల్ఎస్ కేంద్ర ఇన్‌చార్జీ బాబురావ్

ఆర్థికనేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెంబి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్‌హెచ్‌వో హన్మాండ్లు అన్నారు. బుధవారం మండలంలోని మందపల్లి గ్రామంలో పెంబి పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కస్టమర్లు తమ డెలివరీ ప్యాకేజ్‌ని చెక్ చేసి ప్యాకేజ్‌ని స్వీకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ బృందం ఉన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి

జాబితా ప్రత్యేకంగా రూపొందించాలి



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రాధా రాథోడ్

లక్ష్మణచాంద, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకుండా ప్రస్తుతం ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితా ప్రత్యేకంగా రూపొందించాలని ఎంపీడీవో రాధారాథోడ్ బుధవారం ఆదేశించారు. మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి కోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని కావునా వారి నుంచి స్వీకరించిన దరఖాస్తుల ద్వారా వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించి సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం

నర్సాపూర్(జి), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి సబ్ ఇన్స్‌పెక్టర్ సాదిక్ హుస్సేన్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అంగడిబజార్‌లో పానీపూరి దుకాణంలో సోదాలు నిర్వహించగా ఇద్దరు మైనర్లు చట్ట విరుద్ధంగా పనిచేస్తున్నట్లు గుర్తించి, నిర్వాహకుడు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్లను పనిలో ఉంచుకున్న శంకర్‌పై చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మైనర్లను పనిలో ఉంచుకుంటే యజమానులపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ అధికారులు, హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ జమీర్, మహిళా కానిస్టేబుల్ వజ్రమ్మ, సీడబ్ల్యూసీ అధికారులు మమత, గంగాధర్, జిల్లా లేబర్ అధికారి కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ ఎస్సై రాహల్ గైక్వాడ్ అన్నారు. మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో విద్యార్థులకు ఖానాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

సోన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం బొప్పారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఫటా..ఫట్...

పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందిస్తున్నాం

● ముథోల్ సీడీపీవో సరోజని



ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీడీపీవో సరోజని తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు. మరిన్ని వివరాలు ..

ప్రశ్న: : ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఎన్ని మండలాలు...? ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి...? ఎలా కొనసాగుతున్నాయి...?

జవాబు: ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం మండలాలు కలిపి మొత్తం 180 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల లోపు విద్యార్థులు 2,518 చిన్నారులున్నారు. సున్నా నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 10,910 ఉన్నారు. గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన విద్య, చిన్న చిన్న పదాలు నేర్పుతున్నాం. అలాగే త్వరలో ఐదుసంవత్సరాల పిల్లలకు కూడా దుస్తులను పంపిణీ చేస్తాం.

ప్రశ్న: : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏఏ పోస్టులు ఎన్ని ఖాళీ ఉన్నాయి...? ఎన్ని సొంత భవనాలున్నాయి...?

జవాబు: ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ సెంటర్లకుగాను 15 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 75 ఆయా పోస్టులు ఖాళీ ఉన్నాయి. అలాగే 3 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. అద్దె భవనాలు 75, రెంట్ ఫ్రీ భవనాలు 68, సొంత భవనాలు 37 ఉన్నాయి. ఖాళీ పోస్టుల గురించి ఉన్నతాధికారులకు నివేదించాం.

ప్రశ్న: : అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు...?

జవాబు: అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సూచించిన విధివిధానాలను తప్పక పాటిస్తున్నాం. ప్రతి అంగన్‌వాడీ టీచర్ సమయపాలన పాటించే విధంగా పర్యవేక్షణ చేపడుతున్నాం. అంతేకాకుండా పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, తల్లులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారం సక్రమంగా అందించేలా పర్యవేక్షణ చేపడుతున్నాం. అంతేకాకుండా అలాగే పౌష్టికాహారం, ఆకు కూరల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి, ముథోల్)

రబీ సాగుకు రైతాంగం సన్నద్ధం

● పత్తిని తీసివేస్తున్న అన్నదాతలు
● అడుగంటుతున్న భూగర్భ జలాలు



విత్తనాలు నాటేందుకు సిద్ధం చేసిన పంట పొలం

తాంసి, జనవరి 8ట (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ఈ సంవత్సరం రైతాంగానికి తీవ్రనష్టాలతో పాటు కష్టాలను చవిచూయించింది. ఇక రబీ తమకు ప్రత్యామ్నాయమని రైతులు ఆ పంటల సాగు కోసం ముందడుగు వేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు మూడునెలల ముందుగానే పత్తి పంట పూర్తి అయింది. దిగుబడులు తగ్గి పూర్తిగా నష్టాలను చవి చూసిన అన్నదాతలు ప్రస్తుతం రబీ సాగు కోసం సమాయత్తమవుతున్నారు. తాంసి మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు రబీ సాగుకు రైతులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఈ పాటికి కొంతమంది రైతు లు విత్తనాలు నాటగా మరి కొంత మంది రైతులు పత్తిని తీసి విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడు రబీ సాగు గణనీయంగా పెరగనుందని చెప్పవచ్చు. రబీ సాగులో శనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, నువ్వుల పంటలను సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పాటికి కొంతమంది రైతులు శనగవిత్తనాలు నాటి సుమారు 40 రోజులు కావస్తుంది.

● **జొన్నసాగుకు రైతాంగం ఆసక్తి**

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం జొన్నసాగు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాంసి మండలమే కాదు జిల్లా వ్యాప్తంగా ఈ పంటను సాగు చేసేం దుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఎందుకంటే ఈ జొన్న పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర ఉండడమే కాకుండా ప్రతి మండలానికి మార్కెట్ సదుపాయం కూడా ఉంది. దీంతో జొన్నపై ఎక్కువ మొగ్గు చూపుతున్నారని చెప్పవచ్చు. ఈ పాటికి కొంతమంది జొన్నవిత్తనాలు వేయగా చాలామంది రైతులు పత్తిని తీసి జొన్నలు వేసేందుకు ముందుకు వస్తున్నారు.



ట్రాక్టర్‌తో పత్తిని తొలగిస్తున్న రైతు

● **అడుగంటుతున్న భూగర్భ జలాలు**

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం భూగర్భజలాలు అప్పుడే అడుగంటిపోతు న్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బోర్లలో ఉన్న నీరు సైతం పూర్తిగా తగ్గిపోయిందని అంటున్నారు. ఈ లెక్కన రబీ సాగు ప్రశ్నార్థకమే అయినప్పటికీ చేసేది ఏమీ లేక రైతులు సాగు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఖరీఫ్ ఆదు కోకపోయినా కనీసం రబీ సాగుతోనైనా రైతుల కష్టాలు తీరుతాయని ఆశిద్దాం.

భైంసాలో బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు

● వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టిన కమలనాథులు
● బీజేపీ మాజీ ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



మాజీ ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్‌శ్రేణులు

భైంసా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం హైదరాబాద్‌లో చోటు చేసుకున్న ఘటనలను నిరసిస్తూ బుధవారం భైంసాలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ఆందోళనలు చేపట్టాయి. బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దడిగే భోజన్న, ప్రతినిధులు సోలంకే భీంరావ్, నిజాం వేణుగోపాల్, రావుల పోశెట్టి, సుష్మరెడ్డిల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టాయి. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాంగ్రెస్ పార్టీకి తగురీతిలో గుణపాఠం నేర్పుతామని బీజేపీ ప్రతినిధులు వెల్లడించారు. ఇక కాంగ్రెస్ శ్రేణులు తమ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదురి దిష్టిబొమ్మకు శవయాత్ర చేపట్టి బస్టాండ్ ఎదుట దహనం చేశారు. యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్‌నుమాన్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ రమేష్ బిదురిని బీజేపీ అధిష్ఠానం తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్‌నుమాన్ డిమాండ్ చేశారు. ఇందులో కాంగ్రెస్ ప్రతినిధులు మహ్మద్ షఫీ, బెజ్జంకి ముత్యంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కాంబ్లే సాహేబ్‌రావ్, దుడ్డు ప్రసాద్, దీక్షిత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



భైంసాలో నిరసన ప్రదర్శనలు చేపడుతున్న బీజేపీ శ్రేణులు

కాంగ్రెస్ తీరు మార్చుకోకుంటే గుణపాఠం నేర్పక తప్పదు

● **బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్**

అధికారముందనే అహంకారపూరిత తీరును కాంగ్రెస్ మార్చుకోకుంటే తగినరీతిలో గుణపాఠం నేర్పక తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. యూత్‌కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై, పార్టీ శ్రేణులపై కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ వ్యవస్థలను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ శ్రేణులు హేయమైన చర్యలకు పాల్పడితే తరిమి కొడుతామని వెల్లడించారు. విద్రోహశక్తులతో పోరాడి నిలిచిన బీజేపీ శ్రేణుల ముందు ఇలాంటి చిల్లర వేషాలు పనిచేయవన్నారు. కాంగ్రెస్ శ్రేణులు తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని వెల్లడించారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి వత్తాసు పలుకకుండా బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారందరిపై కేసు నమోదు చేసి కఠినశిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దీపాలంకరణ సేవ



పల్లకీ సేవలో భక్తులు

భైంసా, జనవరి 8 : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆల యంలో భక్తుల కోలాహలం మధ్య బుధవారం సహస్ర దీపాలంకరణ సేవలు కమనీయంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ సేవకు పట్టణ భక్తులే కాకుండా సమీప ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం వేళలో ప్రారంభమైన ఈ వేడుకలు రాత్రి వరకు కన్ను లపండువగా కొనసాగాయి. ముందుగా సహస్ర దీపాలంకర ణ సేవను నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను శోభా యాత్రగా ఉంజల్ సేవ కోసం తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై డోలోత్స వం, ఉంజల్ సేవనోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్మల్‌కు చెందిన ఇందూర్తి అచార్యకళ్యాణ్ ప్రవ చనాలను నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ సేవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రత్యేకపూజలు చేపట్టారు. మహిళా భక్తులు భక్తి శ్రద్దలతో గేయాలను ఆలపిస్తూ దీపాలంకరణ సేవా, డోలోత్సవం, ఉంజల్ సేవలో పాల్గొన్నారు. రాత్రి వేళలో దీపాలంకరణ సేవతో ఆలయ ప్రాంగణమంతా దేదీప్యమానంగా వెలిగి కొత్తశోభను సంతరించుకుంది. మూడుగంటలపాటు జరిగిన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. చివరగా తీర్థ, ప్రసాద వితరణతో వేడుకలు ముగిశాయి.



ఉత్సవమూర్తులు

తాంసికి సంచార జీవులు



ఒంటెలతో తాంసి మండలంలో సంచరిస్తున్న రాజస్థానీయులు

తాంసి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదులు కాదు, వందలు కాదు వేలకిలోమీటర్ల దూరం నుంచి పిల్లాపాపలతో కాలినడకన వచ్చి గొర్రెలు మేపుతున్నారు. రాజస్థానీలు. ఎడారులను దాటి వచ్చి నెలల తరబడి సంచరిస్తూ వారి వారి పశువులను మేపుతూ ఉంటారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మూడునాలుగు రోజుల నుంచి రాజస్థానీలు తాంసి మండలంలో అడుగు పెట్టారు. ఆయా గ్రామాల్లో తిరు గుతూ వారి వారి పశువులను మేపుతున్నారు. ఎముకల కొరికే చలిలో సైతం పంట పొలాల్లోనే వాళ్ళు నిద్రిస్తూ ఉంటారు. అక్కడే ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటారు. ఈ సందర్భంగా రాజస్థానీకి చెందిన అంబర్‌సింగ్‌ను ఆంధ్రజ్యోతి పలకరించగా తమ ప్రాంతాల్లో ఎడారులు ఉండడంతో పశువులకు మేత దొరక డం లేదని తెలిపారు. మేనెల చివరి తేదీ వరకు ఇక్కడే గొర్రెల ను మేపుతూ ఉంటామని వారు పేర్కొన్నారు. తాము యజమాని కింద నౌకరుగా పనిచేస్తుంటామని వారు వివరించారు.

భైంసాలో నయనం కళాకారుల ప్రదర్శనలు

భైంసా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ చరిత్రను ప్రజలకు తెలిసేలా నిర్వహిస్తున్న నిర్మల్ ఉత్సవాలలో భైంసా పట్టణానికి చెందిన శ్రీ నయనం నృత్యకళానిలయం కళాకారులు చేపడుతున్న సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళానిలయానికి చెందిన చిన్నారులు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు అహూతులను విశేషంగా అలరారిరించాయి. చూపరులను మంత్ర ముగ్దులను చేసేలా చేపడుతున్న నృత్యాలు ఉత్సవాలకే వన్నె తెచ్చాయి. శ్రీ నయనం నృత్యకళా నిలయం డైరెక్టర్ డా.రంగు సౌమ్య సారథ్యంలో చిన్నారులు సంస్కృతి, సంప్రదాయాలు, రామాయణ ఘట్టాలు, వెంకటేశ్వర స్వామి మహత్యాలు, దేశభక్తి గేయాలపై చేపడుతున్న నృత్యాలు అందరిచే మన్ననలు పొందాయి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌లు శ్రీ నయనం నృత్య కళా నిలయం కళాకారులను, డైరెక్టర్ డా.రంగు సౌమ్యలను అభినందించి జ్ఞాపికలను బహుకరించారు.



నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు



కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కళా నిలయం కళాకారులు

ఆకాశంలో అద్భుత దృశ్యం

తలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఆకాశంలో దృశ్యాలు చూపరులను కనువిందు చేశాయి. సూర్యఅస్తమయం సమయంలో ఆకాశంపైన తెల్లటిగీతలు మండుతున్న సూర్యుడు ఆకాశంలో చుక్కల ముగ్గు వేసినట్టు సుందరమైన దృశ్యాలు కనబడడంతో ప్రకృతి ప్రేమికులు చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సుందర దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.



ఆకాశంలో అందమైన సుందర దృశ్యం

ముగిసిన మహాసాయి పారాయణం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగిన మహాసాయి పారాయణం కార్యక్రమం ముగిసింది. ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పారాయణం నిర్వహించిన అనంతరం పట్టణ పురవీధుల గుండా కొనసాగిన సాయిపల్లకి ఊరేగింపు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా సాగింది. ఆయా కాలనీల్లోని మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి సాయి పల్లకిని దర్శించుకున్నారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు పారాయణ ప్రాంగణానికి చేరుకున్న సాయి పల్లకి, బాబా పాదుకలను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు కార్యక్రమ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మహాపారాయణ నిర్వాహకులు, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... వారం రోజుల పాటు ఇక్కడ నిర్వహించిన మహాసాయి పారాయణంలో పాల్గొన్న సాయి భక్తులకు బాబా కృపతో తాము కోరుకున్న కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు. 11 ఏళ్లగా నిర్మల్‌లో నిర్విరామంగా సాయి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వచ్చే సంవత్సరం కూడా 12వ సారి ఇదే ప్రాంగణంలో సాయి పారాయణం నిర్వహిస్తామన్నారు. వారంరోజులుగా ప్రత్యేకపూజలు నిర్వహించిన వికాస్ మహారాజ్‌తో పాటు పూజారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, నందు, పండరి, కృష్ణ, శ్రీనివాస్, కోలశంకర్, రేఖ, రమ, మనోహర్, పాల్గొన్నారు.



సాయి పల్లకి ఊరేగింపు

భైంసాలో ప్రజావాణికి శ్రీకారం

● ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీల స్వీకరణ ● ఎస్పీ డా. జానకీ షర్మిల



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల

భైంసా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డివిజన్ వాసులకు పోలీసు శాఖ సేవలు మరింత చేరువలోకి తీసుకవచ్చే చర్యలకు జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల శ్రీకారం చుట్టారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో వారానికి ఒకసారి (ప్రతి బుధవారం) చేపట్టే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అక్కడిక్కడే సంబంధిత పోలీసుస్టేషన్ల ఎస్ఐలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు వివరాలను తెలియచెప్పి చట్ట ప్రకారం వాటిని పరిష్కరించే చర్యలకు ఉపక్రమించారు. ప్రజావాణిలో పాల్గొన్న పోలీసు అధికారులకు నేరుగా, హాజరుకాని పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను వివరించి కాలయాపనకు తావులేకుండా పరిష్కరించే విషయంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జానకీషర్మిల్ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడోవ్యక్తి ప్రమేయం లేకుండా , పైరవీలకు చోటు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లుగా పేర్కొన్నారు. ప్రజలకు పోలీసుశాఖ సేవలను మరింత చేరువగా తీసుకువెళ్లాలనే లక్ష్యంతో పాటు పడుతున్నట్లుగా వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా పకడ్బందీగా వ్యవహరిస్తున్నట్లుగా తెలిపారు. డివిజన్‌వాసులు ప్రజావాణిని సద్వినియోగం చేసుకొని చట్ట ప్రకారం తమ తమ సమస్యలను అర్జీ ద్వారా అందచేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ టౌన్, రూరల్ సీఐలు గోపినాథ్, నైలుతో పాటు ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

● **ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిలకు పలువురి సన్మానం**

పోలీసుశాఖ సేవలను ప్రజావాణి ద్వారా డివిజన్‌వాసులకు అందుబాటులోకి తీసుకవచ్చిన జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిలకు పలువురు సన్మానించారు. భైంసా మండల బీజేపీ మహిళా ప్రతినిధి సుష్మారెడ్డి నేతృత్వంలో పలువురు కమలనాథులు క్యాంపు కార్యాలయంలో ఎస్పీని కలిసి ఘనంగా సన్మానించారు. పోలీసు శాఖ సేవలను విస్తృతపరుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

సమ్మె ముగిసినా అందని బియ్యం



మూసిఉన్న డీఆర్‌డిపో

ఉట్నూర్, జనవరి 8(ఆంధ్ర జ్యోతి); సంక్రాంతి పర్వదినం సమీపి స్తుండగా ప్రజలందరూ రేషన్ బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా పిండి వంటలు కావాల్సిన చకినాల కోసం బియ్యం కావల్సి వస్తుండడంతో రేషన్ దుకాణాల్లో లభించే బియ్యం వస్తాయని భావిస్తున్న ప్రజలకు బియ్యం పంపిణీ ఎండమావిగా తయారైంది. వారం రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు 7 రోజుల పాటు సమ్మె చేశారు. సివిల్ సప్లై కమిషనర్ గతంలో ఒప్పుకున్న హామీలతో అంగీకరించడంతో సమ్మెను హమాలీలు విరమించినప్పటికీ చౌకధరల దుకాణాల్లో బియ్యం అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉట్నూరు డివిజన్‌లోని ఉట్నూర్ నార్నూర్ ఇంద్రవెల్లి గాదిగూడ మండలాల్లో ఉన్న 72 రేషన్‌షాపులకు ఉట్నూరు మం డల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగి నుంచి బియ్యం సరఫరా కావలసి ఉంటుంది. నిజామాబాద్ నుంచి సివిల్ సప్లై అధికారులు ఉట్నూరు గిడ్డంగికి లారీల ద్వారా చేర వేస్తే, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యం లో ఉట్నూరులో ఏర్పాటు చేసిన వాహనాలతో 72 చౌక ధరల దుకాణాలకు, జీసీసీ డీఆర్ డిపోలకు బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. పైనుంచి బియ్యం రాకపోవడంతో తమ బియ్యం సరఫరా చేయలేక పోతున్నామని గోడౌన్ ఇన్‌చార్జి మహేందర్ తెలిపారు.

అబాకస్ పోటీలకు ఎంపిక

బోథ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రానికి చెందిన నాగభూషణం పాఠశాల విద్యార్థులు మిమిశ్‌రెడ్డి, హర్షినిలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నిర్మల్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించిన విశ్వం అబాకస్ ఆధ్వర్యంలో పోటీ లను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్మల్ జిల్లా ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి బహుమతులు అందజేశారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 11.7



నిర్మల్
జిల్లా వార్తలు

గురువారం 9 జనవరి 2025



రుణాల రికవరీలో.. అగ్రస్థానం



- రాష్ట్రంలోనే ముందు వరుసలో జిల్లా మహిళా సంఘాలు
- 440 కోట్ల రూపాయల రుణ వసూళ్లు
- వరుసగా మూడేళ్ల నుంచి మొదటి స్థానంలోనే
- రుణాల డబ్బులతో ఉపాధి బాట
- ఆదర్శంగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలు

నిర్మల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సరైన పొదుపు విధానాలను పాటిస్తూ, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత మూడేళ్ల నుంచి వరుసగా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం రుణాలు తీసుకుంటూనే గడువులోగానే వాటిని చెల్లించి ప్రశంసలందుకుంటున్నారు. ఇలా ఇక్కడి మహిళా సంఘాలు మూడేళ్ల నుంచి రాష్ట్రంలోనే 100 శాతం రుణాల చెల్లింపులో అగ్రస్థానం దక్కించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల చెల్లింపులో ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలిచి పొదుపు సంఘాల ఐక్యతను చాటుతున్నారు. వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి కూడా రుణాల చెల్లింపులో జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులు మొదటి వరుసలో నిలవడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఈసారి కూడా వీరు మొత్తం 480 కోట్ల బ్యాంకు రుణాల బకాయిలకుగాను 440 కోట్ల రూపాయలను వసూలు చేయడం విశేషం. జిల్లాలో మొత్తం 12,032 స్వయం సహాయక సంఘాలుండగా ఇందులో మొత్తం 1,37,799 మంది మహిళా సభ్యులున్నారు. అలాగే 504 గ్రామ సమైక్య సంఘాలు కూడా అదనంగా పని చేస్తున్నాయి. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చిన రుణాలలో 100 శాతం టార్గెట్ పూర్తి చేశారు. ఇదిలా ఉండగా 2022-23 సంవత్సరంలో 450 కోట్ల రూపాయల రుణాలను మహిళా సంఘాలకు అందించారు. 2023-24 సంవత్సరంలో 480 కోట్ల రూపాయలను బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందజేశారు.

పొదుపు బాటలో మొదటి నుంచే అగ్రస్థానం

జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలు మొదటి నుంచి రుణాల విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండడం గమనార్హం. సంబంధిత శాఖ అధికారులు సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయంగా వ్యవహరిస్తూ వీరు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంలో సఫలీకృతులవుతున్నారు. జిల్లాలో మొత్తం 12,032 స్వయం సహాయక సంఘాలు ఉండగా ఈ సంఘాల్లో 1,37,799 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. మహిళా సంఘాల లీడర్లు తీసుకున్న రుణాలను సద్వినియోగం ఎలా చేసుకోవాలన్న అంశంపై సంబంధిత అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని దానికి అనుగుణంగా రుణాల డబ్బులను సద్వినియోగం చేసుకుంటున్నారు. రుణాల ద్వారా తీసుకుంటున్న డబ్బులను వ్యాపారాలపైన ఇతరత్రా వాటిపై పెట్టుబడులు పెట్టి వాటి ద్వారా లాభాలు సైతం ఆర్జిస్తున్నారు. ఇలా రుణాల ద్వారా తీసుకున్న డబ్బులను దశలవారీగా బ్యాంకులకు చెల్లిస్తున్నారు. తమ రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ కొత్త రుణాల కోసం మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. వీరి దరఖాస్తులను సానుకూలంగా పరిశీలిస్తున్న బ్యాంకులు ఎలాంటి డ్యూస్ లేకపోతుండడంతో వీరికి వెంట వెంటనే మళ్లీ రుణాలను అందిస్తున్నాయి. దీంతో వీరు వ్యాపారాలపై పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జిస్తూ కుటుంబాల పోషణలో తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 504 గ్రామ సమైక్య సంఘాలదీ అదే బాట

జిల్లాలో 12,032 స్వయం సహాయక సంఘాలతో పాటు మరో 504 గ్రామ సమైక్య సంఘాలు కూడా కొనసాగుతున్నాయి. ఈ సంఘాలు సైతం రుణాలను సకాలంలో చెల్లింస్తుండడంతో ఇటు పొదుపు సంఘాలు అటు గ్రామ సమైక్య సంఘాలు సమిష్టిగా రుణాల రికవరీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తున్నాయి. ఇక్కడి డీఆర్‌డీఏ అధికారులు పొదుపు సంఘాల మహిళలను ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తూ పర్యవేక్షణ చేస్తుండడంతో ఇక్కడ సమిష్టి కృషి ఫలిస్తుంది. డీఆర్‌డీఏ అధికారులు మొదటి నుండి రుణాల మంజూరు ఆ తర్వాత తీసుకున్న డబ్బుల వినియోగంతో పాటు వీరు చేసే వ్యాపారాలకు అవసరమైన సూచనలు, సలహాలు కూడా అందిస్తుండడం రికవరీ విజయానికి కారణం అవుతోంది.



జిల్లా మహిళా సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

నిర్మల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేవరకోట దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శన భాగ్యాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కొండా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఉత్తర ద్వార దర్శనం శేషవాహనసేవలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు నరేందర్, చిరంజీవి, సంతోష్, చిన్నరాజన్న, జాదవ్ అనిత భీమ్‌రావు, దేవేందర్ గౌడ్, నవీన్ కుమార్, ఆలయ ఈవో కే. భూమయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి కళాశాలలో జాబ్ మేళా

నిర్మల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సత్యసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం హైదరాబాద్ హెసీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్ బి ప్రోగ్రాం కోసం 2023-24 ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేయబోయే ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, కంప్యూటర్ల విద్యార్థులకు ఉద్యోగ మేళా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు శిక్షణ, ఉద్యోగ ఉపాధితో పాటు ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తామని హెచ్‌సీఎల్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యాధికారి జే. పరుశురాం, మేనేజర్ రాజేష్, ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నర్సాపూర్(జి), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర హనుమాన్ ఆలయంలో గురుస్వామి రమణారెడ్డితో ఇరుముడి కట్టించుకుని తన్మయంతో శరణుఘోష చెప్పుకుంటూ శబరిమలకు స్వాములు బయలుదేరుతున్నట్లు గురుస్వామి రమణారెడ్డి తెలిపారు. ఈ యాత్రలో సందీప్ రెడ్డి, మణిదీప్, శ్రావణ్, సతీష్, వెంకట్ స్వాములు వెళ్తున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తానూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని సబ్ సెక్షన్ ఆఫీసులో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏఈ ప్రదీప్ జాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు సమావేశం నిర్వహించనున్నట్లు, బాసర్ సబ్ డివిజన్‌లోని తానూర్, ముథోల్, బాసర, లోకేశ్వరం మండలాల విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే ఈ వేదికలో పరిష్కరించుకోవాలని సూచించారు.

మాతృ మరణాల నివారణకు రెండు రోజుల శిక్షణ

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్



శిక్షణ కార్యక్రమానికి హాజరైన వైద్యాధికారులు

నిర్మల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అధిక ప్రమాదకర ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్న గర్భవతులను గుర్తించడంపై, నిర్వహణపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ... మాతృ మరణాలను నివారించడానికి, నియంత్రిచడానికి అన్ని రకాలైన చర్యలు తీసు కుంటున్నామని, దానిలో భాగంగా గర్భవతులలో అధిక ప్రమాదకర లక్షణాలను వెంటనే గుర్తించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై, పునఃశ్చరణ తరగతుల కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డాక్టర్ సరోజ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుస్మిత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్
విజనరీ లీడర్‌గా ఆర్జీయూకేటీ వీసీ



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, జనవరి, 8 : (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్టాత్మక బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్‌లో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అలిసేరి స్థానం పొందారు. బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్ తన తాజా ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత నాయకత్వాన్ని పునర్నిర్వచించే ప్ర ముఖ వ్యక్తుల జాబితాను విడుదల చేసింది. మ్యాగజైన్ ప్రపంచవ్యాప్తంగా మార్పు, ఆవిష్కరణలకు అభివృద్ధికి సంబంధిత రంగాలలో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులను సత్కరిస్తుంది. ప్రముఖ వ్యక్తులలో ప్రొఫెసర్ గోవర్ధన్ అలిసేరి, సీమా సింగ్, శ్రవణ్‌శెట్టి ఇంద్రనీల్ ముఖర్జీ, డాక్టర్ ప్రాన్సిస్కో బుల్నెస్ తదితరులు ఉన్నారు. ఈ దార్శనిక నాయకులు అసాధారమైన దృష్టి, నాయకత్వం, ఉత్తమమైన నిబద్ధతను ప్రదర్శించారు. బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్ గుర్తింపు వ్యక్తుల కృషి, అంకితభావం, వినూత్న స్పూర్తికి నిదర్శనం. వారి జీవితం ఇతరులకు స్పూర్తినిచ్చే సందేశాత్మకతను కలిగి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ గౌరవప్రదమైన జాబితాలో ప్రొఫెసర్ గోవర్ధన్ చేరడం ఆయన అసాధారణ నాయకత్వానికి, ధృక్పథానికి నిదర్శనం, వైస్ ఛాన్సలర్‌గా, ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యలో ఆవిష్కరణలు, నాణ్యతను పెంచడంలో కీలకపాత్ర పోషించారు. అకాడమిక్ ఎక్స్‌లెన్స్ పట్ల అతని నిబద్ధత, యువతను ప్రోత్సహించడంలో అంకితభావమే ఆయన గుర్తింపు, గౌరవాన్ని సంపాదించి పెట్టిందని యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అభినందనలు తెలిపారు. భవిష్యత్తుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

నర్సాపూర్(జి), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఒకరు మృతి చెందిన ఘటన నర్సాపూర్(జి) మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజనీ తండా గ్రామానికి చెందిన జాదవ్ శ్రీనివాస్(44) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడన్నారు. నొప్పి భరించలేక ఆదివారం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఖానాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో తాటిచెట్టు పైనుండి పడి పోతుగంటి రాజుగౌడ్ అనే గీత కార్మికుడికి తీవ్రగాయాలన్నాయి. ఐదు రోజుల క్రితం కల్లు సేకరించేందుకు వెళ్లిన రాజుగౌడ్ తాటి చెట్టు ఎక్కాడు. నడుముకు ఉన్న మోకు తెగిపోవడంతో చెట్టు పైనుండి కిందపడ్డాడు. దీంతో నడుముకు తీవ్రంగా దెబ్బతాకి కదలలేని పరిస్థితిలో ఉండడంతో చుట్టుపక్కల వారు రాజుగౌడ్‌ను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోలార్ ప్లాంట్ల స్థల సేకరణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని మండలాల్లో అధికారులు సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రస్తుత విద్యుత్ ఉప కేంద్రాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, వినియోగానికి వీలుకాని భూములను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్ తదితర సంబంధ అధికారులందరూ సంయుక్త సర్వే నిర్వహించి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలన్నారు. ఒక్కో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదు ఎకరాలకు పైగా భూమి అవసరమని తెలిపారు. సౌర శక్తి వినియోగాన్ని పెంచేందుకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే చివరి అంకానికి చేరుకుందని తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించిన వారిని గుర్తించి వాటిని రద్దు చేయాలన్నారు. మరణించిన, వలస వెళ్లిన దరఖాస్తుదారులను గుర్తించి జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లు, ఆర్డీవో రత్నకల్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏడీ ల్యాండ్ సర్వేయర్ సుదర్శన్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవతరగతి పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం, కార్యాచరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9,127 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రానున్నారని, అందులో 4,687 మంది బాలికలు, 4,442 మంది బాలురని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సంబంధిత విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. విద్యాసంస్థల్లో ఇప్పటికే సిలబస్ పూర్తయినందున రీవిజన్ క్లాసులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను నైతికంగా ప్రోత్సహించడంతో పాటు తగిన గైడెన్స్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల ప్రగతిని గమనించేందుకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల హాజరు, అభ్యాసం, ప్రగతిపై నిరంతర పరిశీలన చేయాలని, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్‌సింగ్, ఎంఈవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అనుమతుల కోసం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

అటవీ అనుమతుల కొరకై పరివేష్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరివేష్ పోర్టపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో బోర్లు వేయాలన్న, రోడ్లు వేయాలన్న, వంతెన నిర్మాణాలు ఇతర అభివృద్ధిపనులు చేపట్టడానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. దీనికోసం పరివేష్ పోర్టల్ ద్వారా అనుమతుల కొరకు దరఖాస్తు చేయాలన్నారు. తదనంతరం రాష్ట్ర స్థాయిలో లేదా జాతీయ స్థాయిలో సమస్య పరిష్కరించబడుతుందన్నారు. దీనికోసం రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోడు పట్టాలు కలిగిన రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, రెవెన్యూ, అటవీ శాఖ, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛకు సంకెళ్లు కవితా సంపుటి ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోలీసుభీమేష్ రచించిన స్వేచ్ఛకు సంకెళ్లు కవితా సంపుటిని మంగళవారం నిర్మల్ ఉత్సవాల్లో కలెక్టర్ అభి లాష అభినవ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. సంపుటికి రాష్ట్ర యువ పురస్కారం రావడం గర్వించదగిన విషయమని కలెక్టర్, మాజీ మంత్రి అభినందించారు.

బ్రహ్మన్‌గాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన ముథోల్ ఎమ్మెల్యే



బ్రహ్మన్‌గాం ఎత్తిపోతల పథకంలో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మన్‌గాం ఎత్తిపోతల పథకాన్ని బుధవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరిశీలించారు. ముథోల్ ఉమ్మడి మండలంలోని రైతులతో కలిసి ఎమ్మెల్యే బ్రహ్మన్‌గాం ఎత్తి పోతల పథకం స్థితిగతులను తెలుసుకున్నారు. 6 వేల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా గత ప్రభుత్వం రూ. 80 కోట్ల రైపాయల నిధులు వెచ్చించి బ్రహ్మన్‌గాం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినప్పటికీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల లిఫ్టింగ్ పరికరాలు దొంగతనానికి గురయ్యాయి. దీంతో రైతాంగానికి సాగునీరు అందలేదన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ శాసనసభ దృష్టికి తీసుకురావడంతో మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో అందులో భాగంగానే ఎమ్మెల్యే రైతులతో కలిసి బుధవారం ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, పంపింగ్ పనులకు ఏఏ సౌకర్యాలు కావాలో రైతులకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను శాసనసభ దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం తక్షణ సహాయంగా రూ. 6 కోట్ల నిధులు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ముథోల్, బాసర మండలాల్లో గన్నేర, రువ్వి తండా, బ్రహ్మన్‌గాం, కిర్గుల్, కిర్గుల్(బి) గ్రామాల్లో సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సాగౌడ్, సుదర్శన్, సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్; మాజీ ఎంపీటీసీలు దేవోజీ భూమేష్, లక్ష్మీనారాయణ, కిష్టారెడ్డి, రాజు, బాలాజీ, శేఖర్, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సతీష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, రమేష్, శ్రీనివాస్, దత్తాద్రి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



గాయాలైన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ముథోల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో ఆటోబోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం వ్యవసాయ కూలీలతో ముథోల్ నుంచి అబ్దుల్లాపూర్‌కు వరినాట్లు వేయడానికి వెళ్తున్న ఆటో రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న రజిత, పోశెట్టి, గంగామణి, లక్ష్మీ, స్వరూప, శిల్ప, లక్ష్మీ, రజితలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించగా ఈఎంటీ మాధవ్, పైలెట్ చంద్రశేఖర్‌లు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోలీసులతో దురుసుగా
ప్రవర్తించిన వ్యక్తి పై కేసు

లోకేశ్వరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం లోకేశ్వరం ఎస్సై జి. అశోక్, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మన్మథ్ గ్రామానికి చెందిన అబ్దుల్లాపూర్ భోజారెడ్డి అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుకుంటూ రాగా ఎస్సై జి. అశోక్ అతన్ని ఆపి డ్రంగ్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తుండగా, లోకేశ్వరం పోలీసుస్టేషన్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి అతని విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అబ్దుల్లాపూర్ భోజారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై జి.అశోక్ మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి



సారంగాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల స్వర్ణ గ్రామానికి చెందిన రాజుల సాయి(35) అనే వ్యక్తి బుధవారం ఉదయం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం రాజుల సాయి భారయ పుట్టింటికి వెళ్లిపోవడంతో తాగుడికి బానిసై మంగళవారం రాత్రి మద్యం సేవించిన సమయంలో పురుగుల మందు తాగడంతో చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.